అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



కాచారంలో డ్వాక్రా భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: మండలంలోని వివిధ అభివృద్ధి పనులను బుధవారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ప్రారంభించారు. మండల పరిధిలోని కాచారం, రషీద్‌గూడ, చౌదరిగూడ, పోశెట్టిగూడ గ్రామాల్లో సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ, డ్వాక్రా, బీసీ భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత సర్కారు అన్ని రంగాల సంక్షేమానికి పెద్ద పీట వేసిందన్నారు. ప్రస్తుత సర్కారు కూడా వాటిని కచ్చితంగా కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జయమ్మ, జెడ్పీటీసీ తన్వీరాజు, గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.


పన్నుల వసూళ్లను పూర్తిస్థాయిలో నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పన్నుల వసూలులో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర వెల్లడించారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రాపర్టీ ట్యాక్స్, నాన్ టాక్స్, ట్రేడ్ లైసెన్స్, అడ్వార్‌టైస్మెంట్ ట్యాక్స్ వసూలు చేయాలన్నారు. ప్రతి రోజు అధికారులు, సిబ్బంది తమతమ పరిధిలో ప్రజలకు అవగాహన కల్పిస్తు పన్నులను వసూలు చేయాలన్నారు. పన్నుల వసూలుతో కార్పొరేషన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఉపయోగించుకోవచ్చన్నారు. ప్రజలు పన్నులను సకాలంలో చెల్లించేలా ఇంటింటికి తిరుగుతూ వారికి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ అధికారులు, వార్డు అధికారులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ ఇవ్వండి



గండిపేట మండల మాజీ ఎంపీపీ మల్లేష్

మణికొండ: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తనకు చేవెళ్ల ఎంపీ టికెట్‌ను ఇవ్వాలని గండిపేట మండల మాజీ ఎంపీపీ, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు తలారి మల్లేష్ బీఆర్ఎస్ పార్టీ అధినేతను కోరారు. బుధవారం ఆయన నార్సింగిలో విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీగా మండల అభివృద్ధితో పాటు జిల్లాలో అత్యధికంగా ఉన్న ముదిరాజ్‌లకు తన వంతు సేవలు అందించి వారి మన్ననలు పొందానన్నారు. గత శాసన సభ ఎన్నికలలో రాజేంద్రనగర్ నియోజవర్గానికి పార్టీ సమన్వయకర్తగా పనిచేసి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ప్రకాశ్‌గౌడ్‌ను 4వ సారి గెలిపించటంలో తన వంతు కృషి చేశానన్నారు. తన పనితీరుతో పాటు ఉన్న పరిచయాలు, పటిష్టంగా ఉన్న పార్టీ బలగంతో తాను గెలుపొందుతానన్నారు. ముదిరాజ్ వర్గానికి ఎంపీ పదవిని ఇచ్చి ప్రోత్సహిస్తారని ఆశిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

అకమ నిర్మాణాల కూల్చివేత



రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి ఇందిరానగర్ సొసైటీలో అక్రమ నిర్మాణాలను బుధవారం రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ అధికారులతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది కూల్చివేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా భారీ షెడ్లతో పాటు నిర్మాణాలను చేపట్టారు. దీంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జీహెచ్ఎంసీతో కలిసి సంయుక్తంగా మొత్తం 5 షెడ్లను కూల్చివేశారు.

జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్

రాయదుర్గం: జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన స్నేహాశబరీష్‌ను గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి బుధవారం కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్కను అందించి సన్మానించారు. అలాగే గచ్చిబౌలి డివిజన్‌లో నెలకొన్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని, చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా మౌలిక వసతుల కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు హన్మంతునాయక్ తదితరులు పాల్గొన్నారు.

'ఐఎస్‌పీ చేంజ్ మేకర్స్' పోటీల్లో విద్యార్థుల సత్తా

శేరిలింగంపల్లి: ఇంటర్నేషనల్ స్కూల్స్ పార్టనర్‌షిప్ (ఐఎస్‌పీ) చేంజ్ మేకర్స్ పోటీల్లో శేరిలింగంపల్లిలోని శాంటామారియా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థుల ప్రాజెక్టులు ఉత్తమంగా నిలిచాయి. వీరు సమర్పించిన 'మర్యాద పూర్వక సంభాషణల క్రూసేడ్, ఈట్‌వైజ్' ప్రాజెక్టులు గ్రాంట్లు కూడా పొందడం విశేషం. ఈ సందర్భంగా విద్యార్థి వనికా మాట్లాడుతూ ఈట్‌వైజ్ ప్రాజెక్టుతో ప్రతి భోజనంలోనూ మార్పు తాలుకా అద్భుతమైన శక్తిని స్వీకరించానన్నారు. ఇది తినడం గురించి మాత్రమే చెప్పదని మార్పును ఎంచుకోవడంతోనే ఆరోగ్యకరమైన దిశలో అడుగులు పడతాయన్నారు. ఈ సందర్భంగా శాంటా మారియా స్కూల్ ప్రిన్సిపాల్ రుచిరాఘోష్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పుడే నీటి కష్టాలు

- వేసవి ప్రారంభానికి ముందే నీటి కటకట
- ఎండిపోతున్న చెరువులు



యాదవమిత్ర కాలనీలో ట్యాంకర్ ద్వారా నీళ్లు పట్టుకుంటున్న దృశ్యం

బండ్లగూడ: వేసవికి ముందే ప్రజలకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. భూగర్భ జలాలు రోజు రోజుకు అడుగంటిపోతుండటంతో కార్పొరేషన్ పరిధిలో నీటి సమస్య తీవ్రమవుతుంది. ఇప్పటికే పలు కాలనీలలోని ఇండ్లలో బోరుబావులు అడుగంటడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున స్థానిక ప్రజలు. గండిపేట మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూగర్భ జల నీటిమట్టం పడిపోవడంతో నీటి ఎద్దడి వేసవిలో తీవ్రస్థాయిలో ఎదురయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. బోర్లలో నీరు ఇంకిపోవడంతో ట్యాంకర్ ద్వారా నీటిని కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని కాలనీలలో వారంలో ఒక రోజే నీటి సరఫరా చేస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే వేసవి కాలంలో నీటి ఎద్దడిని ఎలా ఎదుర్కోవాలన్న ఆందోళన జనాలల్లో వ్యక్తమవుతోంది.

అడుగంటిన చెరువులు..

గత వర్షాకాలంలో కురిసిన వానలకు అనేక ప్రాంతాలలో కుంటలు, చెరువులు పూర్తిగా నిండలేదు. కార్పొరేషన్ పరిధిలో నెలకొన్న పీరంచెరువు, హైదర్షాకోట్ లోని ఎర్రకుంట, కిస్మత్‌పూర్ లేనికుంటలో పూర్తిస్థాయిలో నీటి మట్టం చేరడం లేదు. దీనికి కారణం చెరువులు కబ్జాకు గురికావడమే. చెరువులోకి వచ్చే వరద నీరు కాలువలు సైతం ఆక్రమణకు గురికావడంతో కాలువల ద్వారా నీరు రాకా ఎన్ని వానలు పడినా చెరువులు నిండడం లేదు. చెరువులలో నీరు నిలువ ఉంటే ఇండ్లలోని బోరు బావిలలో నీరు పుష్కలంగా ఉంటుందని కాలనీ వాసులు వాపోతున్నారు.

పలు కాలనీలలో నీటి కోసం..

కార్పొరేషన్ పరిధి పలు కాలనీలో నీటి సమస్యపై మేయర్ మహేందర్‌గౌడ్ జలమండలి అధికారులతో సభ ఏర్పాటు చేసి సమస్య ఏర్పడకుండా తగు చర్యలు చేపడుతామని చెప్పినా.. అవి మాటలకే పరిమితం అవుతున్నాయి. చేతల్లో మాత్రం అమలు కావడం లేదు. అదేవిధంగా కొందరు జల మండలి లైన్‌మెన్‌లు ఎవరు డబ్బులు ఇస్తే ఆ కాలనీకి వాటర్ వదులుతున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి సమస్య రాకుండా తగు చర్యలు చేపట్టవలసిందిగా స్థానికులు అధికారులను కోరుతున్నారు.

మిషన్ భగీరథ రూ.50 కోట్ల నిధులు..

గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా కార్పొరేషన్ పరిధిలో రూ. 50 కోట్ల నిధులతో ఎర్ర కుంట తండా, కిస్మత్‌పూర్ ప్రభుత్వ పాఠశాల, బైరాగిగూడ వద్ద ట్యాంకుల నిర్మాణం చేపట్టి పైపులైన్ పనులు కూడా పూర్తిచేశారు. సరిపడ నీటి సరఫరా మాత్రం పెంచడం లేదు. ఈ వేసవిలో కార్పొరేషన్ పరిధిలో నీటి ఎద్దడి లేకుండా జల మండలి అధికారులు తగు చర్యలు చేపట్టవలసిందిగా స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



రోడ్డు భద్రతా వారోత్సవాల్లో పాల్గొన్న ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

శంషాబాద్: ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవరెడ్డి, ట్రాఫిక్ సీఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన

మండల పరిధిలోని వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో మత్తుపదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం శంషాబాద్ పోలీసులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ ఏసీపీ రాంచందర్‌రావు మాట్లాడుతూ.. మత్తుతో యువత జీవితాలు చిత్తవవుతయన్నారు. మంచి భవిష్యత్తు కోసం యువత మత్తుకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనాథ్, ఎస్సై రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: నార్సింగి సబ్‌స్టేషన్ పరిధిలోని మగ్దా విలేజ్, లెజెండ్ చిమ్ని, ఇస్తానా ఊర్జా విల్లాస్, రాక్‌వెల్ స్కూల్ ప్రాంతాలలో గురువారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, బాలాజీనగర్, నార్సింగి గ్రామం, ఓం కన్వెన్షన్, అక్యూరేట్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాంతాలలో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు, మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రాయల్ ఫంక్షన్ హాల్, డ్యూస్ విల్లాస్, మార్వా టౌన్‌షిప్, నార్సింగి హైట్స్, ఆనంద పోయెట్రీ, ఖాస్వా కాలనీ, అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 29, 30లలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ సందీప్‌రెడ్డి తెలిపారు.

నూతన సీఐగా హరికృష్ణా రెడ్డి



మణికొండ: నార్సింగి పోలీస్‌స్టేషన్ స్టేషన్ హౌజ్ అధికారిగా జి. హరికృష్ణారెడ్డి బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి వరకు ఆయన సైబరాబాద్ సీపీ కార్యాలయంలో పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రజలకు రక్షణ కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. సంఘ వ్యతిరేక శక్తుల గురించి తెలిసిన వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అనుమతులు లేని భవనాల వివరాలు సేకరణ

మణికొండ: ఎలాంటి అనుమతులు లేని నిర్మాణాల అంతస్తులను అధికారులు లెక్కించారు. జీవో 111 పరిధిలోని గౌలిదొడ్డి, వట్టినాగులపల్లి ప్రాంతాలలో బుధవారం మున్సిపల్ శాఖ టౌన్‌ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో అధికారుల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా గౌలిదొడ్డిలో వెలసిన భవనాలను చూసి విస్తుపోయారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఏకంగా ఎనిమిది అంతస్తులతో పాటు రోడ్లను సైతం ఆక్రమించి వచ్చిన నిర్మాణాలను మొదట్లోనే ఎందుకు నిలపలేకపోయారని స్థానిక అధికారులను ప్రశ్నించారు. గతంలో హెచ్ఎండీఏ ప్రత్యేక టీములు వచ్చి సైతం కూల్చివేశారని వివరించారు. భవనాల వివరాలను నమోదు చేసుకుని వెల్లారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ కమిషనర్ బి.సురేందర్‌రెడ్డి, సహాయ సిటీ ప్లానర్ జి. శ్రీధర్‌గౌడ్, టీపీఎస్ మణిహారిక తదితరులు పాల్గొన్నారు.



అక్రమ భవనాల అంతస్తులను లెక్కించిన అధికారులు

'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగనున్నది. 'సక్సెస్ డ్రివెన్ స్ట్రాటజీ' ఫర్ ఎఫెక్టివ్ ప్రొఫెషనల్ అండ్ పర్సనల్ లైఫ్' అనే అంశంపై అమెరికాలోని వర్జినియా సీఓఓ, అధ్యక్షుడు పవన్‌కుమార్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

'మనూ'లో ముగిసిన యూజీసీ ఎంఎంటీటీసీ రిఫ్రెషర్ కోర్సు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో యూజీసీ ఎంఎంటీటీసీ ఎకాలజీ, ఎన్విరాన్‌మెంట్ సైన్సెస్‌లో రిఫ్రెషర్ కోర్సు బుధవారం ముగిసింది. ఎకాలజీ, ఎన్విరాన్‌మెంట్ సైన్స్‌లో రెండువారాల పాటు సాగిన రిఫ్రెషర్ కోర్సును జనవరి 16న ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 54 మంది ఈ శిక్షణలో పాల్గొన్నా రు. పర్యావరణ శాస్త్రంలోని తాజా అంశాలు, ఇతర విషయాలపై అధ్యాపకులకు ఆన్‌లైన్ ద్వారా అవగాహన కల్పించారు. 48 సెషన్లతో కూడిన ఈ కార్యక్రమంలో 12 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, 8 రాష్ట్ర విశ్వవిద్యాలయాల నుంచి రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు. ముగింపు సమావేశంలో యూజీసీ ఎంఎంటీటీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సనీమ్ ఫాతిమా, ప్రొఫెసర్లు, యూజీసీ ఎంఎంటీటీసీ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాదాపూర్‌లోని శిల్పారామంలో అలరించిన వీణా వాయిద్యం, కూచిపూడి నృత్యాలు

శిల్పారామంలో అలరించిన కార్యక్రమాలు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న నేషనల్ హ్యాండ్‌లూమ్ ఎక్స్‌పో గాంధీ రుణాకర్ మేళా సందర్శకులను ఆకట్టుకుంటున్నది. చేనేత కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను గురువారం సందర్శకులు కొనుగోలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆంపిథియోటర్‌లో వేలూరి లక్ష్మి నిర్వహించిన వీణా వాయిద్యం అలరించింది. మృదంగం అనిల్‌కుమార్ సంగీత సహకారాన్ని అందించారు. గౌతమీరాణి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకున్నది. ఇందులో గణేశస్తుతి, ముద్దుగారే యశోద, రామ కోదండరామ, మూషికవాహన, వీణ పుస్తక దారిని, అదిగో అల్లదిగో తదితర అంశాలను కళాకారులు ప్రణవి, శ్రీవేద, అనీక్షిత, శ్రేయన్షి, నందిని, రిత్విక పాల్గొని ప్రదర్శించారు.



క్రైం కార్నర్..

మద్యం తాగవద్దన్నందుకు వ్యక్తిపై దాడి



గాయాలకు గురైన రమేశ్

రాజేంద్రనగర్: దేవాలయం వద్ద అర్ధరాత్రి మద్యం తాగవద్దని సూచించినందుకు తాగుబోతులు ఓ వ్యక్తిని చితకబాదారు. తీవ్ర గాయాలకు గురైన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాజేంద్రనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బన్సీలాల్‌నగర్ ప్రాంతానికి చెందిన ఈగ రమేష్ (40) ఎల్లమ్మ దేవాలయం ప్రాంతంలో ఉంటున్నాడు. సోమవారం అర్ధరాత్రి కారులో వచ్చిన 6గురు యువకులు దేవాలయం వద్ద కారును పార్కు చేసి మద్యం సేవిస్తూ హంగామా సృష్టిస్తున్నారు. దీంతో పక్కనే ఉన్న రమేష్ మద్యం తాగవద్దని.. ఇక్కడి నుంచి వెళ్లాలని సూచించాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న యువకులు తమనే ఇక్కడి నుంచి వెళ్లమంటవా అంటూ చితకబాదారు. గాయాలకు గురైన రమేష్‌ను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. రమేష్ కుటుంబ సభ్యులు మంగళవారం రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బాలికపై అసభ్యకరంగా ప్రవర్తన.. ఇద్దరికి జైలు శిక్ష

రాజేంద్రనగర్: మైనర్ బాలికను కిడ్నాప్ చేసి అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరికి రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లి కోర్టు 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది. వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతానికి చెందిన భాస్కర్ (19), రాహుల్ (21)లు స్నేహితులు. 2017 సెప్టెంబర్ నెల 13వ తేదీన తమ బస్తీకి చెందిన 13 సంవత్సరాల మైనర్ బాలిక స్కూల్ నుంచి వస్తుండగా.. తమ ఆటోలో ఇంటి వద్ద దింపుతామని తెలిపారు.దీంతో రాహుల్ ఆటో నడుపుతుండగా భాస్కర్ వెనుకాల కూర్చొని మైనర్ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాలిక కేకలు వేసింది. స్థానికులు బాలిక కేకలు విని ఇద్దరిని పట్టుకొని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించారు. ఈ కేసులో ఉప్పర్‌పల్లి కోర్టు బుధవారం తుదితీర్పు ప్రకటించింది. ఇద్దరు నిందితులకు 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు భాస్కర్‌కు రూ.8 వేలు, రాహుల్‌కు రూ.4 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

ఆర్థిక కారణాలతో యువకుడి అదృశ్యం



నాగరాజు (ఫైల్)

అత్తాపూర్: చేసిన ప్రతీ వ్యాపారం కలిసి రాకపోవడంతో పాటు ఆర్థిక ఇబ్బందులకు తోడు తండ్రికి అనారోగ్యంతో కలత చెందిన ఓ యువకుడు ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రకు చెందిన చంద్రకాంత్, సుమన్ దంపతులు అత్తాపూర్ పాండురంగానగర్‌లో నివాసముంటున్నారు. వీరికి ముగ్గురు కుమారులు కాగా. రెండో కుమారుడు నాగరాజు కుటుంబ పోషణలో భాగంగా పలు వ్యాపారాలు చేశాడు. ఏ వ్యాపారంలోనూ ఆర్థికంగా నిలబడకపోవడం.. దీనికి తోడు తండ్రి చంద్రకాంత్‌కు బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో కలత చెందిన నాగరాజు మంగళవారం మధ్యాహ్నం సమయంలో తన సెల్‌ఫోన్‌ను ఇంట్లోనే వదిలి వెళ్లాడు. కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఫలితం లేకుండా పోయింది. దీంతో తల్లి సుమన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 9032181132 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

మహిళ ఆత్మహత్య



రేణుదేవి (ఫైల్)

రాజేంద్రనగర్: పరిశ్రమలో పని చేసేందుకు భర్త ఒప్పుకోకపోవడంతో పాటు తనకు ప్రాధాన్యత తగ్గిస్తూ మొదటి భార్యకు ప్రాధాన్యత ఇస్తుండటంతో రెండో భార్య ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బిహార్‌కు చెందిన ధర్మేంద్ర తన మొదటి భార్య, ముగ్గురు పిల్లలతో నగరానికి వలస వచ్చాడు. స్థానికంగా కంపెనీలో ధర్మేంద్రతో పాటు అతని భార్యా కార్మికులుగా పని చేస్తున్నారు. గత 10 నెలల క్రితం ధర్మేంద్ర స్వస్థలమైన బిహార్‌కు వెళ్లాడు. ఆ సమయంలో రేణుదేవి (29)తో పరిచయం కాస్తా ప్రేమగా మారింది. రేణుదేవి భర్త మృతి చెందడంతో ఇద్దరు పిల్లలతో నివసిస్తుంది. అక్కడే రేణుదేవిని వివాహం చేసుకొని 8 నెలల క్రితం నగరానికి వలస వచ్చి లక్ష్మీగూడ ఆర్‌జీకే ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. గత కొన్ని రోజులుగా రేణుదేవి తాను కూడా పని చేస్తానంటూ భర్త ధర్మేంద్రకు తెలుపగ, ఇంటి వద్దే పిల్లలను చూసుకోవాలి అనడంతో మంగళవారం ఉదయం ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ధర్మేంద్ర తన మొదటి భార్యతో కలిసి పనికి వెళ్లాడు. రాత్రి సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో రేణుదేవి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పని నుంచి వచ్చిన ధర్మేంద్ర విషయాన్ని గమనించి మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అత్తపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వ్యక్తి..



షేక్ యాసిన్ (ఫైల్)

అత్తాపూర్: కుటుంబ సభ్యులతో గొడవ పడిన ఓ వ్యక్తి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం..ఎంఎం పహాడీ ప్రాంతానికి చెందిన షేక్ యాసిన్ (46), మలన్‌బేగంలు దంపతులు. షేక్ యాసిన్ రోజువారి కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మలన్ బేగం శుభకార్యాల్లో వంటపని చేస్తూ భర్తకు అండగా నిలస్తుంది. ఇందులో భాగంగా గత నెల 8వ తేదీన కుటుంబ సభ్యులతో గొడవపడిన యాసిన్ ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటికి వెళ్లాడు. అనంతరం తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాల్లో వాకబు చేయగా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన అరుణ్ కుమార్

అత్తాపూర్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ ఆటో డ్రైవర్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అత్తాపూర్ పాండురంగానగర్ ప్రాంతానికి చెందిన అరుణ్ కుమార్, అరుణలు దంపతులు. వీరికి ముగ్గురు పిల్లలు సంతానం. కాగా ఇద్దరు ఆడ పిల్లల వివాహం చేశాడు. ఒక కుమారుడు పాన్ షాపులో పని చేస్తుంటాడు. అరుణ్ కుమార్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య అరుణ జర్మటన్ ఆసుపత్రిలో ఆయాగా పని చేస్తుంది. బుధవారం అరుణ్ కుమార్ భార్యను ఆటోలో ఇంటికి తీసుకొచ్చి తినడానికి ఎమైన వండమని చెప్పి గదిలోకి వెళ్లాడు. భార్య అరుణ దుకాణానికి వెళ్లి వచ్చేవరకు భర్త ఇంట్లో గడియపెట్టి తియకపోవడంతో అనుమానంతో తలుపులు పగలగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆటో డ్రైవర్ అరుణ్‌కుమార్ ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఒకరి మృతి

మియాపూర్: ద్విచక్రవాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన బి.శ్యామ్ (65) మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌పేట వైశాలీనగర్ కాలనీలో నివాసముంటూ స్థానికంగా ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం మంజీరా రోడ్డు దాడుతుండగా ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో శ్యామ్ కిందపడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటటనే స్థానికులు చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా మ ంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోనసీమ (పల్లె) జాతరకు చకచకా ఏర్పాట్లు

- పట్టణంలో ప్రబల తీర్థం వేడుకలు
- నల్లగండ్ల అపర్ణ సరోవర్‌లో ఈ నెల 2,3,4 తేదీల్లో నిర్వహణ



శేరిలింగంపల్లి: 400 వందల ఏళ్ల చరిత్ర ఉన్న కోనసీమ ప్రబల తీర్థం వేడుకలకు శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణ సరోవర్ ముస్తాబవుతోంది. ఈ నెల 2, 3, 4 తేదీల్లో వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు చకచకగా ఏర్పాట్లు చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కోనసీమలో ప్రబల తీర్థం వేడుకలకు 400 ఏళ్ల చరిత్ర ఉందని అపర్ణ సరోవర్ వాసులు పేర్కొంటున్నారు. తూర్పు గోదావరి జిల్లా జగ్గన్నతోట వద్ద జరిపే ఈ వేడుకల్లో ఏకాదశ ప్రబలు 11 గ్రామాల నుంచి తరలివస్తాయి. అవి జగ్గన్నతోట వద్ద కలిసి తీర్థం జరిపిన తర్వాతా ఆయా గ్రామాలకు తిరిగివెళ్తాయి. ఏకాదశ రుద్రులను ఒకే చోట చేర్చి పూజిస్తారు. గ్రామీణ ప్రాంతంలో నిర్వహించే జాతర వలే ప్రబల తీర్థంలో కూడా రంగుల రాట్నాలు, చిలక జోస్యం, కుమ్మరుల కుండల తయారీ విధానం, వీధి గారడీ, బుజ్జి బూరెలు, పీచు మిఠాయిలతో పాటు చేనేత, హస్తకళల స్టాల్స్ వంటివి ఏర్పాటు చేస్తారు.అదేవిధంగా రథం, ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

ఈశ్వరుని రూపంగా ప్రబల తీర్థం..

కోనసీమలో ఈశ్వరుని రూపంగా ప్రబలను కొలుస్తారు. వెదురు కర్రలు, రంగు, రంగుల నూతన వస్త్రాలు, కాగితాలతో తయారు చేస్తారు. అనంతరం వివిధ రకాల పూలతో అలంకరించి శివపార్వతులను ప్రబల్లో ఏర్పాటు చేసి అపర్ణ సరోవర్‌లో ఊరేగింపు వైభవంగా నిర్వహిస్తారని నిర్వాహకురాలు చందన తెలిపారు. సరోవర్‌లో 2016 నుంచి ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమానికి సరోవర్‌లో ఉన్న దేశంలోని అన్ని ప్రాంతాల వారు ఉత్సాహంగా పాల్గొంటారని, ఈ నెల 2వ తేదీన ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రబలను మహిళలు, చిన్నారులు కూడా ఊరేగింపులో మోసేందుకు ఆసక్తి చూపడం ప్రత్యేకం. ఈశ్వరుడిని ప్రబలపై ఉంచి మేళాతాళాలు, కోలాటాలతో ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు.